పదింతల ప్రణాళికతో సన్నద్ధం

- పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు
- 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు
- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు
- నియోజకవర్గంలో 3,058 మంది విద్యార్థులు

నియోజకవర్గంలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
కిర్లంపూడి	8	750
గోకవరం	8	820
జగ్గంపేట	10	1056
గండేపల్లి	6	432
మొత్తం	32	3,058



తామరాడలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

కిర్లంపూడి: విద్యార్థుల బంగారు భవితకు తొలి మెట్టుగా పదో తరగతిని భావిస్తారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఇంటర్, డిగ్రీలో మంచి కోర్సులు ఎన్నుకుని వాటిలో రాణించడానికి అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో విద్యార్థులు ఎంచుకునే ప్రతి గ్రూపునకు పదో తరగతి మార్కులు కీలకం. దానికి అనుగుణంగానే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసింది. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తూ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేలా ఎప్పటికప్పుడు ఎస్సైన్‌మెంట్లు, మాక్‌టెస్టులు పెడుతూ ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు.

జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు...

పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో జగ్గంపేట నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు కంకణం కట్టుకున్నారు. ఇందుకోసం విద్యా శాఖ పంపించిన నూతన టైమ్ టేబుల్ ప్రకారం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధిస్తున్నారు. విద్యార్థుల్లో నూతన ఒరవడిని తీసుకొచ్చేందుకు విద్యాశాఖ 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. దీనిలో భాగంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో ఒక గంట పాటు ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో 32 ప్రభుత్వోన్నత పాఠశాలల్లో 3,058 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులు సిలబస్‌ను పూర్తి చేశారు.

విద్యాశాఖ 100 రోజుల యాక్షన్ ప్లాన్ ఇలా...

- విద్యార్థులకు పరీక్షలంటే భయం తగ్గించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి స్లిప్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.
- ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో విద్యార్థులను గుర్తించి తృతీయ స్థానంలో ఉన్నవారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.
- వెనుకబడిన విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు తగిన సమయం కేటాయిస్తున్నారు.
- రోజూ ఉదయం 8.15 గంటల నుంచి 9.15 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.
- పాఠశాలల్లో సమ్మెటివ్-1 పరీక్షలు ఇటీవల పూర్తయ్యాయి. కాగా జనవరి లేదా ఫిబ్రవరి మొదటి వారంలో సమ్మెటివ్-2 పరీక్షలు నిర్వహిస్తారు.

ప్రత్యేక తరగతులతో మేలు



ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల మాకు మరింత సమయం చదువుకునే అవకాశం కలుగుతోంది. మాకు వచ్చే సందేహాలను ఎప్పటికప్పుడు ఉపాధాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాం. పరీక్షలు బాగా రాసి మంచి స్కోరు సాధిస్తాను.

– **దేవర లక్ష్మణ్**, పదో తరగతి విద్యార్థి, జెడ్పీ హైస్కూల్, తామరాడ

సిలబస్ రివిజన్ చేస్తున్నారు



ఉపాధ్యాయులు సాయంత్రం సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహించి సిలబస్ రివిజన్ చేస్తున్నారు. ఇక్కడే ఉండి చదువుకోవడం వల్ల తోటి విద్యార్థులతో పోటీపడి బాగా చదువుతున్నాను. నాకు గణితం, ఇంగ్లిషు అంటే బాగా ఇష్టం. ప్రత్యేక తరగతుల ద్వారా ఆ రెండు సబ్జెక్టులతో పాటు, మిగతా సబ్జెక్టులలో మరింత పట్టుసాధిస్తున్నాను.

– **బుద్ధ దేవిసుప్రియ**, పదో తరగతి విద్యార్థిని, గెద్దనాపల్లి

ప్రణాళిక అమలు చేస్తున్నాం



కిర్లంపూడి మండలంలోని అన్ని ప్రభుత్వోన్నత పాఠశాలల్లో వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాం. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు యాక్షన్ ప్లాన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో కిర్లంపూడి మండలం ప్రథమ స్థానంలో నిలవాలని ఆశిస్తున్నాం. పాఠ్యాంశాలపై ఏమైనా సందేహాలు ఉంటే విద్యార్థులు భయపడకుండా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలి.

– **టి.జోసెఫ్**, ఎంఈఓ-1, కిర్లంపూడి

క్లుప్తంగా

200 మందికి కంటి వైద్య పరీక్షలు



తిరుమాలిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు ఆదిత్య

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలిలో ఆదివారం 200 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. సైంటిఫిక్ ప్రోగ్రాం ఫర్ అకాడమిక్ అండ్ రీసెర్చ్ క్యూబ్ (స్పార్క్ సంస్థ), ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గ్రహీత సాయిసందీప్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు ఆరోగ్యలో భాగంగా సంస్థ అడ్వైజరీ బోర్డ్ డైరక్టర్ వి.వెంకటరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎస్సై రామలింగేశ్వరరావు ప్రారంభించారు. ఏలేశ్వరానికి చెందిన ఆదిత్య ఆసుపత్రి వైద్య నిపుణులు రోగులకు పరీక్షలు చేశారు. అనంతరం రూ.30 వేల విలువైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పార్క్ సంస్థ స్టేట్‌ఇన్‌చార్జ్ రవికిరణ్, కో ఆర్డినేటర్ సాహుల్, నవనీత్, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

కత్తిపూడిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి గ్రామ సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

కేంద్ర మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి



ధర్మవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న లిబరేషన్ శ్రేణులు

ప్రత్తిపాడు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని ధర్మవరంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఆ పార్టీ శ్రేణులు ధర్నా చేపట్టారు. అమిత్ షా రాజీనామా చేయాలని, వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు అనసూరి లక్ష్మి, గొల్లపల్లి కామరాజు, గుడాల వెంకట లక్ష్మి, పల్లా లక్ష్మి, శింగులూరి చక్రం, వల్లూరి సూర్యారావు, రాపా పెదరాయుడు, చింతల అచ్చియ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

బలరామపురం మాజీ సర్పంచ్ భాస్కరబాబు మృతి



భాస్కరబాబు (ఫైల్)

రౌతులపూడి: బలరామపురం మాజీ సర్పంచ్ సోమరౌతు భాస్కర్‌వెంకన్నదొర (భాస్కరబాబు) (71) ఆదివారం మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంగా బాధపడుతున్నారు. ఆదివారం గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఐదు సార్లు బలరామపురం గ్రామ సర్పంచ్‌గా, ఒక పర్యాయం ఎంపీటీసీ సభ్యుడిగా, రౌతులపూడి కో ఆపరేటివ్ తిసభ్య కమిటీ చైర్మన్‌గానూ పని చేశారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీలో సీనియర్ రాజకీయ నాయకుడిగా కొనసాగుతున్నారు. ఆయన మృతికి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతర పార్టీల నేతలు సంతాపం తెలిపారు.

మండల అధికారుల నంబర్లు

కోటనందూరు:

తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ-1	89856 02864
ఎంఈఓ-2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613
ఎస్సై	94409 00773
వెలుగు ఏపీఎం,	80088 04895
ఉపాధిహామీ ఏపీఓ,	70939 98217

వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని వినతి



అన్నవరంలో కృష్ణ తేజకు స్వాగతం పలుకుతున్న సర్పంచ్ కుమార్ రాజా

అన్నవరం: గ్రామంలో నిర్మిస్తున్న శ్మశానవాటికలో రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా కోరారు. ఈ మేరకు ఆదివారం అన్నవరం దేవస్థానానికి వచ్చిన పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజను కలిసి వినతిపత్రం సమర్పించారు. అన్నవరంలో సుమారు 20 వేల మంది ప్రజలు నివసిస్తున్నప్పటికీ హిందూ శ్మశానవాటిక లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 2022లో అప్పటి జిల్లా కలెక్టర్ పంపా నదికి సమీపంలో కొండను ఆనుకుని 1.20 ఎకరాల భూమి కేటాయించారని తెలిపారు. అక్కడకు వెళ్లేందుకు సిమెంట్ రోడ్డు నిర్మించాల్సి ఉందని, శవాల దహనాలకు బెడ్స్, పైకప్పు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఆయా వసతుల కల్పనకు నిధులివ్వాలని కోరారు.

సత్యదేవుని దర్శించిన పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజ

రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్‌డీ కృష్ణ తేజ శనివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి ఈఓ వి.సుబ్బారావు ఆధ్వర్యంలో పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఈఓ అందచేశారు. ఆయన వెంట పలువురు పంచాయతీరాజ్ అధికారులు ఉన్నారు.

వరివడిగా పంట ఒబ్బిడి



ప్రత్తిపాడులో హైవే పక్కన ఆరబెట్టిన ధాన్యం

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో ఖరీఫ్ పంట ఒబ్బిడి పనులు చివరి దశకు చేరుకున్నారు. గత మూడు రోజులుగా భయపెట్టిన వాతావరణం ఆదివారం కాస్త మారింది. సూర్య భగవానుడు కాస్త కన్నెర్ర చేయడంతో ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో పంట ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. వరి పంట చేతికి అందే దశలో వాతావరణంలో పెనుమార్పుల వల్ల రైతులెవ్వరూ కోతలు కోయవద్దంటూ వ్యవసాయాధికారుల ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు రైతులు పంటను కోయకుండా అలానే వదిలిపెట్టారు. ప్రస్తుతం చివరికి గింజలైనా దక్కుతుందన్న ఆశతో పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. కళ్లాలు ఏర్పాటు చేసుకునే అవకాశం లేకపోవడంతో చేలల్లో పంటను రోడ్డుకు చేరుస్తున్నారు. రహదారులనే ధాన్యం అరబెడుతున్నారు. ఆరిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు.

రబీ సాగుకు నీరు విడుదల

కిర్లంపూడి: మండలంలోని సోమవరం ఎత్తిపోతల పథకం చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. సోమవరం ఎత్తిపోతల పథకం ద్వారా రబీ పంటలకు ఏలేరు ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బస్వా వీరబాబుతో కలిసి ఆదివారం ఆయన నీటిని విడుదల చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన నీటి సంఘం సభ్యులను ఆయన అభినందించారు. ఎంపీపీ తోట రవి, డీసీలు నీలం శ్రీను, లింగంపర్తి రాజు, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, మండలాధ్యక్షుడు చదరం చంటి, ఏలేరు ప్రాజెక్ట్ డివిజనల్ ఇంజినీర్ గవరయ్య తదితరులు పాల్గొన్నారు.

వానరాల వీర విహారం



ఏలేశ్వరంలో గుంపులుగా తిరుగుతున్న కోతులు

ఏలేశ్వరం: పట్టణంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. కోతులు బహిరంగ ప్రదేశాలతో పాటు ఇళ్లల్లోకి ప్రవేశించి సామగ్రిని ధ్వంసం చేస్తున్నారు. జనసావాసాల మధ్య తిరగుతూ ప్రజలపై దాడులకు పాల్పడటంతో జనం బెంబేలెత్తుతున్నారు. స్థానిక సాయిబాబా మెట్ట వద్ద రహదారులపై కోతులూ గుంపులుగా తిరుగుతూ వాకర్స్, భక్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. దుకాణాలపై దాడులు చేసి వ్యాపారులను నష్టపరుస్తున్నాయి. రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. ముఖ్యంగా అరటి, వరి, అపరాల పంటలను ధ్వంసం చేయడంతో రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లెల్లో క్రిస్మస్ సందడి



ప్రత్తిపాడు ఇందిరా కాలనీలో ఓ ఇంటిపై స్టార్‌లు



ప్రత్తిపాడు ఆర్‌సీఎం చర్చి వద్ద ఏర్పాటు చేసిన స్టార్

ప్రత్తిపాడు: గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. ఈ నెల 25న క్రిస్మస్‌ను పురస్కరించుకుని క్రైస్తవులు చర్చిలను సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఏసు క్రీస్తు జన్మదినాన్ని ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన కూడళ్లలో ఇప్పటికే పెద్దపెద్ద స్టార్‌లను ఏర్పాటు చేశారు. క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసే లైట్లతో కూడిన తారలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మండలంలోని 23 సచివాలయాల పరిధిలో అన్ని గ్రామాల్లోనూ ప్రధాన చర్చిలను ఇప్పటికే సుందరంగా ముస్తాబు చేశారు. క్రైస్తవులు చర్చిలతో పాటు గృహాలపై స్టార్‌లను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా చర్చిల్లో ఉపవాస ప్రార్థనలు జరుగుతున్నాయి. మండల పరిధిలో సుమారు 150 వరకూ చర్చిలున్నాయి. వీటన్నింటినీ ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు. రంగులు, విద్యుత్ దీపాలతో క్రిబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయండి సారూ !



ఎస్.అన్నవరం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఎదుట దూసుకువెళుతున్న వాహనాలు

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం మెయిన్ రోడ్డులో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద భక్తుల రద్దీ ఉంటోంది. కాగా ఇక్కడ వాహనాలు సైతం వేగంగా వెళ్లడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఆలయం వద్ద వాహనాల వేగాన్ని నిరోధించేందుకు స్పీడ్ బ్రేకర్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు. గతేడాది మెయిన్ రోడ్డును విస్తరించడంతో వాహనదారులు వేగంగా దూసుకువెళుతున్నారు. దీంతో ఆలయానికి వెళ్లొచ్చే భక్తులు ప్రమాదాల బారిన పడుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే వాహనాల వేగం తగ్గి ప్రమాదాల నివారించవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు వేయాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

బీసీ ఉద్యోగుల సంఘ డివిజన్ అధ్యక్షుడిగా రాజబాబు



విద్యుత్ శాఖ బీసీ ఉద్యోగుల సంఘం జగ్గంపేట డివిజన్ నూతన కార్యవర్గ సభ్యులు

అన్నవరం: రాష్ట్ర విద్యుత్‌శాఖ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ జగ్గంపేట డివిజన్ అధ్యక్షుడిగా జూరెడ్డి రాజబాబు ఎన్నికయ్యారు. స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ కార్యదర్శిగా పి.నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అమీర్, కోశాధికారిగా సతీష్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.అశోక్, రమణ, నాగూర్, శివ రామకృష్ణ ఎంపికయ్యారు. సమావేశంలో విద్యుత్ శాఖ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు, డిస్కం అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

గండేపల్లి: గణిత మేధావి, శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. తొలుత శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గణిత శాస్త్రం అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవీ హరనాథ్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మల్లిశాల జెడ్పీ హైస్కూల్‌లో కలసిన పూర్వవిద్యార్థులు

జగ్గంపేట: మండలంలోని మల్లిశాల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 2007-08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో వివిధ చోట్ల స్థిరపడిన వారంతా సుమారు 15 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడిగా గడిపారు.

కనకదుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో గోదాదేవి అమ్మవారు

గండేపల్లి: మండలంలోని మురారిలో వేంచేసిన కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతో పలు ప్రాంతాల నుంచి వాహనాలపై భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వంటావార్పుచేసుకుని అక్కడే భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అమ్మవారి సన్నిధిలో గడిపారు.

గుబ్బాలమ్మ వారికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: మండలంలోని మురారి గ్రామ దేవత గుబ్బాలమ్మ అమ్మవారిని ఆదివారం పలువురు నేతలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో రాజ్య సభ సభ్యుడు సానా సతీష్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్, గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి పాశురాల పారాయణ

జగ్గంపేట: స్థానిక రాజగోపాలస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి పాశురాల పారాయణ నిర్వహించారు. తొలుత పండితులు గోదాదేవికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సాగునీటి నిల్వలు పెంచేందుకు చర్యలు





రైతుల భూమి సరిహద్దుల్లో వర్షపు నీటి నిల్వ కోసం తవ్వుతున్న కందకాలు (అంతరచిత్రం) డి.పోలవరంలో రింగ్ ట్రెంచ్‌లు తవ్వుతున్న ఉపాధి కూలీలు

తుని రూరల్: సాగునీటి నిల్వలు పెంచేందుకుగాను ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కందకాలు, ట్రెంచ్‌ల తవ్వకం పనులు వేగంగా జరుగుతున్నాయి. మండలంలో డి.పోలవరం, దొండవాక, రాపాక, ఎస్ఎస్‌వీ నగరం, తేటగుంట, ఎస్.సూరవరం, కొలిమేరు, తదితర గ్రామాల రైతుల భూముల్లో ఈ పనులు జరుగుతున్నాయి. రైతుల భూముల సరిహద్దుల్లో కందకాలు, పండ్ల తోటల్లో రింగ్ ట్రెంచ్‌లు తవ్వుతున్నట్టు డి.పోలవరం ఫీల్డ్ అసిస్టెంట్ సుర్ల గాంధీ తెలిపారు. ఎకరాను యూనిట్‌గా పరిగణించి ఒక్కొక్క యూనిట్‌కు రూ.59 వేలు ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో నిధులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. వర్షాలు కురిసినప్పుడు కందకాలు, ట్రెంచ్‌లలో నీరు చేరడంతో సాగునీటి ఎద్దడిని నివారించవచ్చన్నారు. భూగర్భ జలాలు పెరుగుతున్నాయని ఎఫ్ఏ వివరించారు. ఎంతమంది రైతులు ముందుకు వచ్చినా ఈ పనులకు ప్రతిపాదనలు చేసి తవ్వకాలు చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.